చలనం

దీపావళి కథలపోటీలో బహుమతి రూ 500/-ల పొందిన కథ

'మా అమ్మ పోయిందిట'—

తెలుగు అక్షరాల్ని కూడబలుక్కుంటూ కార్టూన్‌ని చదువుకుంటున్న కాన్వెంట్ పిల్లాడిలా చెప్పేడు, శ్రీనివాస్.

నేను అదిరిపడ్డాను. ఈ పిడుగుపాటు నుంచీ నేను తేరుకొనేలోగానే మరో మాటా చెప్పేడు, 'ప్రభుదాస్ కంపెనీ'కీ నాకూ కూడా ఋణానుబంధం' తీరిపోయింది. నేనక్కణ్నుంచి తప్పుకున్నాను.

ఈ వార్త నాకేమీ ఆశ్చర్యాన్ని కలిగించ లేదు. నేను అతనికేసి చూశాను. గోడవైపు తిరిగి పడుకున్నాడతను. పాంటూ, షర్టూ శరీరాన్ని అంటిపెట్టుకుని అలాగే వున్నై. ఒక్కొక్కప్పుడు — రాత్రుళ్లు నిద్రపోయే ముందు దుస్తులు మార్చుకోడు అతను. అది అతని అలవాటు.

టైమ్ చూసేను. పదకొండూ ఇరవై అయింది.

'ఎప్పుడు జరిగిందిట — ఈ ఘోరం ?' అడిగేను.

'నాలుగు రోజులైంది. ఖాదర్ రాశాడు.'

శ్రీనివాస్‌ని ఇప్పుడేం అడిగినా అంతకు మించి సమాధానం లభించదు. ఇది నాకు తెలుసు. లైట్ తీసేసి నేనూ పడుకున్నాను.

శ్రీనివాస్ నేనూ బియ్యే మొదటి సంవత్సరంలో కలుసుకున్నాం. నేనూ అతనూ ఒకే గదిలో వుండేవాళ్లం. నలభీమ పాకాలు చెయ్యడంలో ఆరితేరినవాడు శ్రీనివాస్. వేళకు కంచం దగ్గర కూర్చోవడంవరకే నా పని. అయితే, ఒక్కొక్కప్పుడు హఠాత్తుగా 'ఇవ్వాళా రేపూ వంట చెయ్యను' అనేవాడు. నేను హోటల్‌కి పోతూ పిలిస్తే — 'నువ్ వెళ్లు. నేను రానులే' అనేవాడు. ఆ రెండు రోజులూ నిరాహారదీక్ష.

ఇద్దరమూ కాలేజీకి బయల్దేరితే — మధ్య దారిలో 'నువ్ పద. నేను రానులే' అనేవాడు, తక్కున ఆగిపోయి. 'ఏమైందిరా' అంటే — వేదాంతిలా ఓ నవ్వు నా మొహాన్న పారేసి, 'తోచడంలేదురా. అలా మంగినపూడి పోయొస్తాను' అని వెళ్లిపోయేవాడు.

ఒక్కొక్క రోజు రాత్రి ఏ ఒంటిగంటకో గదికి చేరేవాడు. 'సినిమానా మళ్లీ' అంటే— 'కాదు. రంగడి గుడిలో కూర్చున్నాన్లేరా' అనే వాడు ముభావంగా.

పరీక్ష రోజుల్లో సినిమాకుపోయొచ్చి కొండచిలువలా మంచాన్ని చుట్టుకుపోయే వాడు. పైగా, లైట్ వుంటే నిద్రపట్టదు. నన్ను మరొకరి రూమ్‌కి పోయి చదువుకోమని కసురుకునేవాడు.

ఒకసారి —

ఎందుకో మధ్యరాత్రి మెళకువ వచ్చింది నాకు. పక్కన మంచం ఖాళీగా వుంది. టైమ్ చూశాను. ఒకటిన్నర. గదితలుపు లోపల గడియవేసేవుంది. దాన్ని బయట నుంచి కూడా వేసి వెళ్లవచ్చు. ఈ రహస్యం మాయిద్దరికే తెలుసు. లేచి బయటికివెళ్లి చూశాను. అప్పుడప్పుడూ కాంపౌండ్ గోడకు ఆనుకుని వున్న బావి చప్టామీద టవల్

పరచుకుని పడుకుంటూ వుంటాడు — చల్లదనం కోసం. ఆ చుట్టూరా — కీచురాళ్ల రొద, దూరంనుంచీ వినిపించే వివరం లేని సవ్వళ్లూ, బూరుగుచెట్టుమీద కొంగలు రెక్కలల్లార్చే చప్పుళ్లూ — వీటన్నింటినీ ఆనందిస్తూ ఆకాశంలో చుక్కల్ని లెక్కిస్తూ ఎదుకునేవాడు. ఆవేళ — అక్కడా లేడు. లోపలికొచ్చి పడుకున్నాను. తెలతెలవారుతుండగా వచ్చాడు. నేను మెళకువగా వుండటం గమనించి చెప్పేడు, 'వెన్నెల్లో అలా పెడనదాకా నడిచేను' అని. రానూ పోనూ ఎనిమిదిమైళ్లు—ఎందుకువెళ్ళినట్టు?

రెండో సంవత్సరం —

పరీక్షరోజులు—రాత్రి పదకొండు దాటింది. టీ తాగివచ్చి దీక్షగా చదువుకుంటున్నాను. టేబుల్ దగ్గరకూర్చుని ఏదో రాస్తున్నాడు శ్రీనివాస్. ఉన్నట్టుండి, 'మ్లానంగా' అంటే ఏమిటిరా అని అడిగేడు. నాకు అర్థం తెలీదు. అదే చెప్పేను. 'ఆ మాటెందుకు వచ్చింది' — ఉత్సుకతని ఆపుకోలేక అడిగేను. 'కథ రాస్తున్నాన్లే. చాలా కథల్లో— 'మ్లానంగా నవ్వింది, నవ్వేడు' అని రాస్తూ వుంటారు. అంటే ఏమిటా అని. 'ఇప్పుడా కథలెందుకు — పరీక్షకు చదువుకో' అన్నాను. 'మవ్ కానీ ఆ పని' అన్నాడు. నాకు తెలుసు. అతను వాదనను హర్షించడు. నేను మౌనం వహించాను.

బియ్యే చివరి సంవత్సరంలో —

కాలేజి లైబ్రరీలో ఇంగ్లీష్ లెక్చరర్ హరిప్రసాద్‌గారిని కలుసుకుని, 'మాష్టారూ— మీ అమ్మాయి సుందరి నన్ను ప్రేమిస్తున్నానంటోంది. నా గురించి మీ అభిప్రాయం ఏమిటి? నాకు మాత్రం ఆమెపట్లా, మీపట్లా సదభిప్రాయం లేదు' అన్నాట్ట శ్రీనివాస్. హరిప్రసాద్‌గారు చండశాసనుడు. తన కూతురిమీద అభాండాలు వేసి ఆమె జీవితంతో చెలగాటమాడుతున్నాడని నానా హంగామా చేసి కాలేజి అంతా అదరగొట్టేశాడు హరిప్రసాద్‌గారు. నేను మా రూమ్‌లో అంతరంగికంగా 'ఏమిటిరా — ఈ గొడవంతా' అంటే, 'ఇందరు నమ్మనిది నువ్ నమ్మినా ఏం చేస్తావ్?' అని ఎదురు ప్రశ్న వేశాడు. తనలో తను గొణుక్కుంటున్నట్టు—'ఐ హేట్ ఆల్ దిస్' అన్నాడు.

మర్నాడు — శ్రీనివాస్‌ని కాలేజినుంచి 'డిబార్' చేశారు!

పది రోజుల తర్వాత —

నా గదినుంచి అంతర్ధానమైనాడు శ్రీనివాస్. వాళ్ల ఊరు — సిరిపురం — అడ్రస్‌కి ఉత్తరం రాశాను. వాళ్ల నాన్న — ఆచార్యులవారు సమాధానం రాశారు — అతను ఇంటికి రాలేదనీ, కాలేజీలో జరిగినదంతా తమకు తెలిసిందనీను.

బియ్యే అయిన తర్వాత—యూనివర్శిటీలో చేరడానికి వైజాగ్ వెళ్తుంటే విజయవాడలో ఖాదర్ కలిశాడు. అతనిదీ సిరిపురమే. శ్రీనివాస్ గురించి నేను అడిగేలోగానే అతను వివరాలు చెప్పేడు.

శ్రీనివాస్ మేరీ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వాళ్ల నాన్నా వాళ్ళు అతని పెళ్లిని నిరసించి కులభ్రష్టుడై పోయాడని వెలివేశారు. అతను అందర్నీ వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటి వరకూ ఎవరూ పట్టించుకోని శ్రీనివాస్



గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి విశిష్ట ఉత్పత్తి మార్కెట్ చేయువారు ® మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు. MCA-MSS-61-Tel



గురించి — సిరిపురమూ, సిరిపురంలో మనుషులూ, అతనికి అయినవాళ్లూ ఆలోచించడం మొదలైంది. లోకం శ్రీనివాస్ గురించి మాట్లాడసాగింది. అవీ ఇవీ కథల్ని అల్లుకునీ, అపవాదుల్ని ప్రచారం చేసుకునీ సంతృప్తి పడసాగింది.

— నేను విజయవాడలో లెక్చరర్‌గా చేరేను.

అన్నయ్య మద్రాస్ వెళ్తుంటే స్టేషన్‌కి వెళ్లాను. కంపార్ట్‌మెంట్‌లో నుంచి శ్రీనివాస్ దిగేడు! నేను ఆశ్చర్యంలోనూ, సంతోషంలోనూ మునిగిపోయాను.

ఇంటికి వచ్చేం.

విశేషాలు చెప్తాడని కళ్లు విప్పుకుని చూస్తూ కూర్చున్నాను అతనికేసి. 'ముందు— ఆకలవుతోంది; భోజనానికి పోదాం పద' అన్నాడు.

మాసికలు వేయడానికి వీలుపడని ఆకాశమంత అనర్థాన్ని శ్రీనివాస్ మొహంలో చదువుకున్నాన్నేను. అతని మనస్సులో కుంగిపోయిన పునాదులు — కళ్లల్లో నీలి నీడల్ని పరచటం గమనించాను. ఎండిపోతున్న చెట్టుని వళ్లీ కొత్తకొమ్మలు వేయమని అడగాలి కాబోలు అనిపించింది.

ఆ రాత్రి —

చాలా ముక్తసరిగా తన గురించి చెప్పేడు. తను కొంప కూల్చాడని రాద్ధాంతం చేసి బయటికి నడిపించారు — తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ.

ఆ బొమ్మలన్నీ ఒక మట్టితో తయారైనవి; ఆ పీలికలన్నీ ఒకే తానులోవి. తనే పరాయివాడూ, పనికిరానివాడూ అయినాడు. కారణం — మేరీ!

రెక్కలమ్ముకుందామనే ధైర్యంతో — ప్రపంచపు సుడిగుండంలోకి దూకేడు. ఎక్కడా ఒదగని మనస్తత్వం — ఇక్కడా అక్కడా ఎన్నో జీవనభృతుల్ని మార్పింది. జీవితం వినోద ప్రదర్శనగా మారింది. చివరికి వంటలు కూడా చేసేడు. మేరీ కోసం తనను తాను నడిబజార్లో వేలం వేసుకునైనా ఊపిరి పీలుద్దామని ప్రయత్నించాడు. కానీ — వానపాములా అయింది తన పరిస్థితి. తుంచకుండా విడదీయడానికి వీలులేని పీటముడిలా తయారైంది దాంపత్య జీవనం.

మేరీ ఎవరితోనో లేచిపోయింది!

ఆశపెడితే చెయ్యి సాచినప్పుడు అరచేతిలో చరచినట్టయ్యింది!

రెండు నెలలు — వళ్లీ నా సాహచర్యంతో శ్రీనివాస్‌ని మనిషిని చేశాను. ఆడిటర్ రామారావుగారి దగ్గర చేరతానన్నాడు. సరే నన్నాను. ఆయనా నా మాట కాదనలేదు.

ఏడాది గడిచింది —

'ప్రభుదాస్ కంపెనీ' శ్రీనివాస్ తప్పుకున్న నాలుగో సంస్థ! ఎంత తరచి చూసినా — కారణమేది కనిపించదు. అతని జీవన యంత్రంలో పాదులై పోతున్న 'పట్టు' ఏమిటో — నాకు అవగతం కాలేదు.

*　　*　　*

తెల్లవారుఝామునే శ్రీనివాస్‌ని లేపేను. 'మనం సిరిపురం పోతున్నాం — బయలుదేర' మన్నాను.

'ఆ ముచ్చటనీ చూడాలనివుంటే అలాగే కానీ' అని బయల్దేరేడు.

— అడ్డరోడ్డు దగ్గర బస్ దిగేసరికీ బారెడు పొద్దెక్కింది. రోడ్డువారగా వున్న సిమెంటు పలక — 'సిరిపురం — 3 కి. మీ.' అని బాణం గుర్తుతో కుడివైపు ఉన్న ఊరుని సూచిస్తోంది.

డొంక వెంట నడక మొదలెట్టాం. శ్రీనివాస్ గబగబా అడుగులు వేస్తున్నాడు. నేను పరిసరాలు పరికిస్తూ నెమ్మదిగా నడుస్తున్నాను.

డొంకకు అటూ ఇటూ — నీళ్లు నిలవగట్టిన మాగాణి పొలాలూ, గట్లమీద ముళ్ల కంచెలూ, అక్కడక్కడా ఎత్తుగా నిలిచిన పుట్టలూ, బాటవెంట పల్లెలూ, జిల్లేళ్లూ — దర్శనమిస్తున్నై.

ఎండ చిటచిటలాడుతోంది. పంటకాలవ వంతెన దాటుతుంటే — ఎవరో రైతు పలకరించాడు — శ్రీనివాస్‌ని. 'ఇప్పుడేనా అబ్బాయ్‌గారూ రావడం' అని, 'ఆ యమ్మ అదృష్టవంతురాలు. పుణ్యస్త్రీగా ఎల్లిపోయింది' అంటూ నెమ్మదిగా ముందుకు కదిలేడు. శ్రీనివాస్ శూన్యంలోకి చూస్తూ నడుస్తూ వున్నాడు. నాకు తెలిసిన శ్రీనివాస్ కుటుంబం, వాళ్ల యింటి పరిస్థితులూ నా కళ్లముందు మెదిలినై.

ఆచార్యులవారు సిరిపురానికీ, చుట్టుపక్కల రెండు మూడు పల్లెలకీ ఆయుర్వేద వైద్యుడు. వేణుగోపాలస్వామి గుళ్లో పురాణం చెప్తాడు. ఆయనకి ఆ గుడి అర్చకత్వం వుంది; ఐదుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలూ వున్నారు; వృద్ధులైన తల్లిదండ్రీ వున్నారు; మంచంలో తీసుకుంటున్న మేనత్త వుంది; రోగిష్టి పెళ్లాం వుండేది.

ఎనిమిదిమంది సంతానంలో మూడోవాడు — శ్రీనివాస్. వాళ్లన్నయ్యకి పెళ్లయింది, ముగ్గురు పిల్లలు; అక్కకి పెళ్లి కావాలి. ఆమెకి పెళ్లి భయం. ఎప్పుడూ

సోవియట్ యూనియన్‌లో భారత రాష్ట్రపతి సతీ సమేతంగా జరిపిన పర్యటన పౌరులను, నాయకులను కూడా యెంతో ఆకర్షించింది. ఈ రెండు చిత్రాలలో శ్రీ నీలం సంజీవరెడ్డి అక్కడి కళాకారులతో ఎంతగా కలసిపోయింది, వారంతా ఆయనను ఎంత ఆప్యాయంగా ఆదరంగా గౌరవించింది గమనించవచ్చును. మొదటి చిత్రంలో శ్రీ రెడ్డి, శ్రీమతి నాగరత్నమ్మ దంపతులు జార్జియాలోని టిబిలిసి లో అక్కడి ప్రముఖుల కళాకారుల స్వాగత సత్కారాలను అందుకుంటున్నారు. రెండో చిత్రంలో వారితోపాటు ఉల్లాసంగా గిటార్ లాంటి స్థానిక వాయిద్య మొక దానిని పలికిస్తున్నారు.

పూజలూ, పునస్కారాలూ – స్నానాలూ జపాలూ. చదువా – పెద్దబాలశిక్షతో సరి. మిగిలిన ఆడపిల్లల్ని–ఏడోతరగతితో 'ఇకచాల్లే' అన్నారు. సిరిపురంలో అప్పర్ ప్రైమరీ స్కూల్ వుండటం దానికి కారణంట. పెద్ద కొడుకు పెళ్ళికాగానే, పెద్దకూతురికీ పెళ్ళి చెయ్యాలని చాలా ప్రయత్నాలు చేశారు – ఆచార్యులవారు. కానీ ఏవీ ఫలించలేదు. ఆమె ససేమిరా పెళ్ళికి ఒప్పుకోలేదు. ఆమె 'ఆమె పారాయణలు', ఆమె స్తోత్రాలతోసరి. రెండో పిల్లకి 'దయ్యం' పట్టిందిట. చెయ్యని వైద్యం లేదు, మొక్కని దైవంలేదు. ఏదైతేనేం,– పెద్దకొడుకు పెళ్ళి తర్వాత – ఆచార్యులవారి ఇంటి ద్వారబంధం ఏ శుభకార్యానికీ తోరణపు మండకి నోచుకోలేదు.

ఇవన్నీ నాకు ఆచార్యులవారు అప్పట్లో అడపా దడపా బందరు వచ్చినప్పుడు తెలియజేసిన సంగతులు.

శ్రీనివాస్ గురించి ఎక్కువగా ఆలోచించినప్పుడూ, అతని 'స్వయంపాకం' తత్వాన్ని గురించి నాలో నేను తర్కించుకుంటూ వుండేటప్పుడూ – అతని ప్రవర్తనకి వాళ్ళ కుటుంబ పరిస్థితులు కొంతవరకూ కారణమేమో అనిపిస్తూవుండేది నాకు!

– 'ఊళ్ళో కొచ్చాం' అన్నాడు శ్రీనివాస్. చింతల తోపులోంచి వెళ్తున్నాం మేము.

సిరిపురంలో సుమారు వో వంద గడప వున్నట్టుంది. చెట్టునుంచీ రాలిన మద్ది కాయల్లా అక్కడొకటీ ఇక్కడొకటీ వున్నై ఇళ్ళు. వాటిల్లో మిద్దెలూ వున్నై; పూరి

చలనం

పాకలూ వున్నై; గుడిసెలూ వున్నై.

పడిపోయి మోకాలు ఎత్తులో వున్న పిట్ట గోడల్ని తప్పుకుని, ఇసుక పరచుకున్న రోడ్డుమీదుగా దేవాలయం ముందుకు చేరేం. అక్కడికొక వంద అడుగుల దూరంలో – కొండరాళ్ళు పేర్చి వాటిమీద రెల్లు కప్పు వేసిన ఇంటిని చూపుతూ – 'అదే మా ఇల్లు' అని ఆగిపోయాడు శ్రీనివాస్. పక్కనేవున్న నాపరాళ్ళ అరుగుమీద కూర్చున్నాడు.

చుట్టు ప్రక్కల ఇళ్ళవాళ్ళు మా రాకని గమనించారు. ఒక్కరొక్కరే మా దగ్గరగా చేరసాగేరు. వాళ్ళు వేసే ప్రశ్నలకి 'ఆఁ' 'ఊఁ'లు సమాధానాలుగా చెప్తున్నాడు శ్రీనివాస్. ఈ వార్తని చెప్పటానికి ఒకరిద్దరు ఆచార్యులవారి ఇంటికేసి వెళ్ళటం నేను గమనించాను. ఆ యింటి వైపు చూసేను.

ఆచార్యులవారు అరుగుమీద కూర్చుని కనిపిస్తున్నారు. అంగవస్త్రాన్ని మోకాళ్ళకీ, నడుముకీ బిగించి; పర్యంక బంధం వేసుకుని ఎవరితోనో మాట్లాడుతున్నారు. ఆయన చేతిలో ఏదో పుస్తకం వుంది. అరుగుమీద ఆయన పక్కన మరో వ్యక్తి కూర్చునివున్నాడు. ఆయన్ని చూపి ఎవరన్నట్టు సైగ చేశాను శ్రీనివాస్ నుద్దేశించి. 'మా అన్నయ్య' అన్నాడు. అరుగుకు ఆనుకుని ఇంటి గుమ్మం ముందు ఆడవాళ్ళూ, పిల్లలూ నిలబడి వున్నారు. అంతా మాకేసి చూస్తున్నారు.

'వెళ్దాం – రా' అన్నాను, శ్రీనివాస్‌తో అతను లేచి తడబడుతున్న అడుగులతో కదిలేడు. ఇంతలో ఎవరో మా ముందుకు వచ్చి చెప్పేరు.

'అక్కడికి రావాల్సిన పనిలేదని చెప్పమన్నారు – అయ్యవారు.'

శ్రీనివాస్ నా కళ్ళల్లోకి చూశాడు. నేను నా మట్టుకు చూసుకున్నాను. అప్పటికే అక్కడ చాలామంది చేరేరు. 'ఫర్వాలేదు. నే చెప్తాను. రా' అంటూ ముందడుగు వేశాను. నాలుగు బారల దూరం నడిచేం.

ఆచార్యులవారు లేచి అరుగు దిగేరు. ఆయన కొడుకూ ఆయన్ని అనుసరించేడు. ఇంటి గుమ్మంలోకి వెళ్ళారు. ఆడవాళ్ళూ పిల్లలూ ఇంట్లోకి వెళ్ళిపోయి నక్కి నక్కి చూడసాగేరు.

మేము మరో పది అడుగులు కదిలేము. ఆ యింటి తలుపులుతక్కున మూసుకున్నై. మా వెనగ్గా ఎవరో కిసుక్కున నవ్వేరు.

ఖాదర్ వాళ్ళ ఇంటికి వెళ్ళాం. అతను మాకు భోజనాలు ఏర్పాటు చేయడానికి బిడియపడటం గమనించి చెప్పేడు, శ్రీనివాస్ – 'పెద్ద చేనుకు రెండు మంచెలు అనవసరం భాయ్' అని 'భోంచేసే పోతాం' అన్నాడు.

ఒకరిద్దరు గ్రామస్తులు అక్కడికీ వచ్చేరు. ఏవో సానుభూతి వాక్యాలు చెప్పటం మొదలెట్టారు. శ్రీనివాస్ వాటిని పట్టించుకోకుండా ఖాదర్‌ని అతని గేయాలు వినిపించమన్నాడు. ఖాదర్ తన పాటలు పాడసాగేడు.

అతను హాస్యప్రియుడు. తెలుగు సినిమా పాటలలో ఇంగ్లీష్ పదాలూ, హిందీ పదాలూ జోడించి అదే బాణీలో పాడటం అతనికి అలవాటుట. ఆ ధోరణిలో కొంతసేపు అతని 'కచేరి' సాగింది.

భోజనాలు కాగానే తిరుగు ప్రయాణమైనాము.

చింతల తోపు చివరగా నిలబడిన ఆరేడేళ్ల పిల్లవాణ్ణి చూసి శ్రీనివాస్ నడక ఆగింది. వాడు పరిగెత్తుకుంటూ వచ్చి 'బాబాయ్' అంటూ శ్రీనివాస్ చేతుల్లో యిమిడిపోయాడు.

నా మనస్సు ఉద్విగ్నమైంది ముందు. క్షణాల తర్వాత అడిగేడు శ్రీనివాస్ వాణ్ణి, 'అమ్మా, నాన్నా, అత్తయ్యలూ అంతా బాగున్నారా' అని. వాడు తల ఊపేడు.

మాతో కొంచెం దూరం నడిచి బళ్ల బాట మలుపు తిరిగేచోట ఆగిపోయాడు వాడు. మేము ముందుకు సాగేము.

దారిలో అన్నాడు శ్రీనివాస్; "మా యింట్లో మా ముత్తాతలనాటి భోషాణం, కావడిపెట్టె, కవిలెకట్ట, గంగాళం వున్నై రాజా. మా నాన్న కాలంలో — ఆ స్థిరాస్తికి మరికొంత చరాస్తి కలిసింది. అదంతా ఎటొచ్చీ నడిచే శవాల రూపంలో వుంది."

పగిలిన గొంతులోంచీ దుమికిన అతని మాటలు నా మెదడు మొదళ్లని కదలించి వేసినై !

* * *

శ్రీనివాస్ మరో కంపెనీలో ఉద్యోగంలో చేరేడు.

ఆ రోజున అన్నాడు : "సిరిపురం నుంచీ వస్తుండగా నీకు చెప్పేను గుర్తుందా ? మా పెరట్లో పాడుబడిన బావి; మా వంటింట్లో

దీపావళి కథ

దణ్ణంమీది మడిబట్టలు; తల వెనక్కి మొలిపించే మా నాన్న అర్భకత్వం; పులుసులో పడిన బొద్దింకల్లా మా యింట్లోఆడవాళ్ళు; ఆ యింటి జనానికే మూసుకుపోయిన లోవాకిళ్ళు — వీటన్నిటిలా కాకుండా నేను ఆ యిల్లు ఖాళీ చేసేనని సంతోషించాను. కానీ, మా యింటివాళ్లు తమ ఉనికినీ, ఆచారాల్నీ అంటిపెట్టుకుపోయినట్టు — ఈ ఉద్యోగ విషయంలో మాత్రం — బల్లిలాంటి నాకు దీపం నీడని అంటుకు పోక తప్పడం లేదు."

అతని పాటకి పల్లవీ, మాటకు రాగమూ మారలేదనుకున్నాను.

ఆర్నెల్లు గడిచినై —

'పెళ్లి సంబంధం చూశాను, పిల్లని చూసిపోక తప్ప'దని అన్నయ్య బలవంతం చేస్తే కాకినాడ వెళ్లి వచ్చాను.

వారం తర్వాత —

అన్నయ్య ఉత్తరం రాసేడు. "మీ తమ్ముడిలో ఏ లోపమూ లేకపోతే కట్నకానుకలు ఎందుకు వద్దంటారు మీరు. మాకు మీ సంబంధం వద్దని రాశారు ఆడపిల్లవాళ్ళ' — ఇదీ సారాంశం !

ఇది విని, శ్రీనివాస్ పగలపడి నవ్వేడు. అతనెప్పుడూ అంతగా నవ్వడం నేనసలు చూడనేలేదు. ఆ తర్వాత అన్నాడు, "దౌర్భాగ్యాలు రెండు రకాలు. ఒకటి — ఎవర్నీ నమ్మలేకపోవడం; రెండోది— అందర్నీ నమ్మడం. అసలు జీవితం — నటన, ఆత్మవంచన, కపట నాటకం కాదంటావా ? హృదయం ఏదో కావాలని తపతపలాడుతుంది, శరీరం దేన్నో పొందాలని వాంఛిస్తూ వుంటుంది. అది అందదనీ, దీన్ని పొందలేమనీ తెలుసు. అయినా, ఏదో తపన. ఆ అగ్ని చల్లారదు, ఈ కాంక్ష చావదు. ఏమీ చెయ్యలేము; అస్థిమితత్వం — అలసత్వం; ఆరాటం — అసహాయత; వీటన్నిటినీ ఛేదించుకొని బయటకి రాలేక, ఆశలు — ఆశయాల పరిధిమీద ఒకే బిందువును పదేపదే పాదాలతో చుంబిస్తూ ఒకటే పరుగు. చివరికి భయంకరమైన యాతనా భారంతో మనిషి చీకటి కోణంలో కూరుకుపోతూనే వున్నాడు."

శ్రీనివాస్ కేసి తేరిపార చూడలేకపోయాను — అతని మాటలు విన్న తర్వాత.

సూర్య శకలంలా మండిపోతున్నాడతను; ఇరుసున బెట్టిన కందెనలా కారిపోతున్నాడతను !

నెలరోజుల తర్వాత, ఒకరాత్రి —

నేను గదికి ఆలశ్యంగా చేరేను. అతను మంచంమీద పడుకుని కళ్లు మూసుకుని వున్నాడు. రెప్పల దిగువనా, కొలకుల్లోనూ — నీటి బిందువులు. ఆశ్చర్యపోయేను. ఏం జరిగిందని అడిగేను.

సన్నగా సమాధానం చెప్పేడు, "మేరీ వస్తానని రాసింది. తిరిగి తనని స్వీకరించవని ... ఏదేదో రాసింది" అని క్షణం ఆగి అన్నాడు మళ్లీ — "నేను వేరే యిల్లు చూసుకోవాలి !"

ఉన్న దానికీ, అనుకున్నదానికీ మధ్యన శిలువ కెక్కిన శ్రీనివాస్ !—ఈ "మనిషి"కి అర్థం ఏ నిఘంటువూ సమకూర్చలేదు !! ఈ 'భూమిక' స్వరూపం ఏ 'మనిషి' సంపూర్ణంగా చిత్రించలేదు !!!

పొడుపు కథకి సమాధానం వెతుక్కుంటున్న పసివాడిలా కళ్ళు మూసుకుని, తల గిరుక్కోసాగేన్నేను !!!!